# ప్రజాభిప్రాయానికి అనుగుణంగా నివేదిక సమర్పిస్తాం


- బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ భూసాని వెంకటేశ్వర్‌రావు
- స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్ల దామాషాపై అభిప్రాయాల స్వీకరణ



కమిషన్ చైర్మన్ భూసాని వెంకటేశ్వర్‌రావుకు అభ్యర్థనపత్రాన్ని అందజేస్తున్న బీఆర్ఎస్ మైనార్టీ సెల్ జిల్లా ప్రెసిడెంట్ నవీద్ ఇక్బాల్

కంఠేశ్వర్/ ఖలీల్‌వాడి, డిసెంబర్ 5 : రాష్ట్రంలో స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషాపై బీసీ డెడికేటెడ్ కమిషన్ నిజామాబాద్ కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా రాజకీయ పార్టీలు, సంఘాలు, ప్రజల నుంచి అభ్యర్థనలను గురువారం స్వీకరించింది. ఆయా కులసంఘాల ప్రతినిధులు, ప్రజల నుంచి కమిషన్ చైర్మన్ భూసాని వెంకటేశ్వర్‌రావు, కార్యదర్శి సైదులు రాతపూర్వకంగా విజ్ఞాపనలను స్వీకరించి, వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ.. ప్రజాభిప్రాయానికి అనుగుణంగా నివేదిక సమర్పిస్తామని తెలిపారు. స్థానిక సంస్థల్లో స్థానంలేని కులాలకు రిజర్వేషన్ కల్పించాలని, కులవృత్తులపై ఆధారపడిన తమకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని, బీసీల జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు ఉండాలనే అంశంపై ఎక్కువ మంది వినతిపత్రాలు అందించారని వివరించారు. కులాలను ఏ,బీ,సీ,డీగా వర్గీకరిస్తే ప్రయోజనం చేకూరుతుందని అభిప్రాయాన్ని వెలిబుచ్చారన్నారు.

బీఆర్ఎస్ పార్టీ ముస్లిం కమ్యునిటీ తరపున జిల్లా మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ నవీద్ ఇక్బాల్ కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. రాష్ట్రంలో ముస్లిం జనాభా 12.7 శాతం ఉన్నదని, జనాభా ప్రకారం లోకల్‌బాడీస్ ఎన్నికల్లో రిజర్వేషన్ కల్పించాలని కోరారు. జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, కౌన్సిలర్, కార్పొరేటర్లు మొత్తం కలిపి 1000 స్థానాలు ఉంటే, ముస్లింలకు 72 సీట్లు మాత్రమే (7.2 శాతం) ఉన్నాయని విన్నవించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, ట్రైనీ కలెక్టర్ సంకేత్ కుమార్, కామారెడ్డి జడ్పీ సీఈవో చందర్‌రాథోడ్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారిణి స్రవంతి, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ అధికారులు స్రవంతి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావును పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ కవిత, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు

# ప్రశ్నిస్తే అరెస్టులా ?

- ప్రజాపాలన కాదు.. రాష్ట్రంలో పోలీసు పాలన
- హరీశ్‌రావు, కౌశిక్‌రెడ్డి అరెస్టు అక్రమం
- కేసులకు భయపడేది లేదు..
- ప్రజా సమస్యలపై వెంటాడుతూనే ఉంటాం
- రేవంత్ సర్కారుకు బీఆర్ఎస్ నాయకుల హెచ్చరిక

మోర్తాడ్/ఎల్లారెడ్డి రూరల్/నందిపేట్, డిసెంబర్ 5: ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే అక్రమంగా కేసులు పెట్టి, అరెస్టు చేయిస్తున్నారని బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు. ప్రజా పాలన పేరు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. రాష్ట్రంలో పోలీసు పాలన నడిపిస్తున్నదని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కౌశిక్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేయడాన్ని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ కవిత, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, జీవన్‌రెడ్డి, జాజాల సురేందర్ గురువారం తీవ్రంగా ఖండించారు. హైదరాబాద్ గచ్చిబౌలి పోలీసుస్టేషన్‌లో నిర్బంధించిన మాజీ మంత్రి హరీశ్‌రావును కవిత, వేముల ప్రశాంత్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే రోజు వస్తుందన్నారు. రాష్ట్రంలో ఉన్నది ఇందిరమ్మ రాజ్యం కాదని, పోలీసుల రాజ్యం నడుస్తున్నదని ధ్వజమెత్తారు. ఇందిరమ్మ రాజ్యం ఎమర్జెన్సీని తలపిస్తున్నదన్నారు. పాడి కౌశిక్‌రెడ్డి ఫిర్యాదు చేసేందుకు వెళ్తే అక్రమంగా కేసు పెట్టి అరెస్టు చేశారన్నారు. ఫిర్యాదు తీసుకునే ధైర్యం ప్రభుత్వానికి లేదన్న కవిత.. అక్రమంగా అరెస్టు చేసిన బీఆర్ఎస్ నేతలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కాంగ్రెస్

ప్రస్తుతం రాష్ట్రంలో కొనసాగుతున్నది ప్రజాపాలన విజయోత్సవాలు కాదు, అక్రమ అరెస్టులు, నిర్బంధ పాలన విజయోత్సవాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. గచ్చిబౌలి ఠాణాలో హరీశ్‌రావును పరామర్శించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇచ్చిన హామీలు అమలు చేయాలని ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేస్తున్నారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలన పేరుతో నిర్బంధపాలన, ఎమర్జెన్సీ పాలన చేస్తున్నారని దుయ్యబట్టారు. రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారన్నారు. రాహుల్‌గాంధీ రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకుని ప్రతిపక్ష నాయకుడిగా నేను ఎక్కడైనా తిరగొచ్చు అంటారు, ఇక్కడ అదే పార్టీ సీఎం మాత్రం ప్రజల పక్షాన ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయిస్తుండడం హాస్యాస్పదమన్నారు. రేవంత్‌రెడ్డి నియంత పాలన చేస్తున్నాడని, దేశంలో ఇంత నీచంగా రాజ్యాంగ ఉల్లంఘన జరగడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. మేధావులు ఆలోచించి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించాలని కోరారు.

## వెంటాడుతూనే ఉంటాం..



ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్‌ను అరెస్ట్ చేసి మోకిలా పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

అరెస్టులు చేస్తే బెదిరేది లేదు.. ప్రజా క్షేత్రంలో రేవంత్‌రెడ్డిని నిలదీస్తూనే ఉంటాం, వెంట పడుతూనే ఉంటామని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ హెచ్చరించారు. గచ్చిబౌలి ఠాణాలో ఉన్న హరీశ్‌రావును పరామర్శించేందుకు వెళ్తుండగా, జాజాల సురేందర్‌తో పాటు టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానంద్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని మోకిలా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా జాజాల మాట్లాడుతూ.. ప్రజల తరపున పోరాటం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులను ఆరెస్టు చేసి, అక్రమ కేసులు పెట్టినంత మాత్రాన బెదిరిపోమన్నారు. రేవంత్‌రెడ్డి ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీల అమలు కోసం ప్రజాక్షేత్రంలో నిలదీస్తూనే ఉంటామని స్పష్టం చేశారు.

## ఇదేనా ఇందిరమ్మ రాజ్యం



ఇందిరమ్మ రాజ్యమంటేనే అంతు లేని హింస అని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి కనుసన్నల్లో సాగుతున్న పోలీసు పాలనతో రాష్ట్రం ఆగమవుతున్నదని గురువారం ఓ ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావుతో సహా బీఆర్ఎస్ నేతల అరెస్ట్ అక్రమమన్నారు. తన ఫోన్ ట్యాపింగ్ అవుతున్నదని ప్రజాస్వామ్య పద్ధతిలో ఫిర్యాదు చేసేందుకు పోలీసు స్టేషన్‌కు వెళ్లిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై తప్పుడు కేసు నమోదు చేయడం ఏమిటని ప్రశ్నించారు. కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన సీఐని ప్రశ్నించినందుకు కేసులు పెట్టడం సిగ్గుచేటని విమర్శించారు. కౌశిక్‌రెడ్డి ఇంటికి వెళ్లిన మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, బీఆర్ఎస్ ఇతర నేతలను అరెస్ట్ చేయడం కాంగ్రెస్ సర్కార్ నిరంకుశత్వానికి నిదర్శనమని నిప్పులు చెరిగారు. హింసాత్మక ఇందిరమ్మ రాజ్యంపై ప్రజలు తిరగబడే రోజు ఎంతో దూరం లేదని హెచ్చరించారు.

## ప్రజాపాలన కాదు.. పోలీసు పాలన



డిచ్‌పల్లి, డిసెంబర్ 5 : రాష్ట్రంలో ప్రజా పాలనే లేదని, పోలీసుల పాలన నడుస్తున్నదని నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ విమర్శించారు. ఈ మేరకు ఆయన గురువారం సోషల్ మీడియాలో ఓ వీడియో పోస్టు చేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అక్రమ అరెస్టులను బాజిరెడ్డి తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలోని ప్రజలు, నాయకులను అరెస్టుల పేరుతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణలో ఏడాది నుంచి ప్రజా పాలన నడువడం లేదని, పోలీసు పాలనే నడుస్తున్నదన్నారు. పరిపాలన చేయడం చేతకాకపోతే సీఎం రేవంత్‌రెడ్డి పదవి నుంచి తప్పుకోవాలని బాజిరెడ్డి డిమాండ్ చేశారు. అబద్ధపు హామీలిచ్చి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ.. ఏ ఒక్క హామీనీ నెరవేర్చలేదని విమర్శించారు.



ఎమ్మెల్సీ కవితతో నవీపేట మండల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు

# స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం

- కార్యకర్తలకు బీఆర్ఎస్ అండగా ఉంటుంది
- నవీపేట మండల నేతలకు ఎమ్మెల్సీ కవిత భరోసా

నవీపేట, డిసెంబర్ 5: బీఆర్ఎస్ నాయకులు ఏమాత్రం అధైర్యపడొద్దని, పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్సీ కవిత భరోసా ఇచ్చారు. కలిసికట్టుగా పనిచేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదామని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ నవీపేట మండల అధ్యక్షుడు వి.నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో గురువారం హైదరాబాద్‌కు వెళ్లి కవితను కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పదేండ్ల కాలంలో కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని గుర్తుచేశారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ గెలుపే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయలేక మోసగించిన తీరును ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. మాజీ ఎమ్మెల్యే షకీల్ సతీమణి ఆయేషా ఫాతిమా, నేతలు అబ్బన్న, పోశెట్టి, ప్రవీణ్‌కుమార్, రమేశ్, సురేశ్, గొట్టిరాజు, స్వామి, జనార్దన్, రాములు, సూరిబాబు, రవీందర్‌రెడ్డి, సాయికుమార్‌గౌడ్, మహిపాల్, శ్రీనివాస్, లక్ష్మణ్, శ్యామ్ తదితరులు కవితను కలిసిన వారిలో ఉన్నారు.

## పింఛన్లు పెంచాలని బీడీ కార్మికుల ధర్నా




కోటగిరి తహసీల్ ఆఫీసు ఎదుట ధర్నా చేస్తున్న బీడీ కార్మికులు

కోటగిరి, డిసెంబర్ 5: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు పింఛన్లను పెంచాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్ జిల్లా కోటగిరిలో బీడీ కార్మికులు గురువారం ధర్నాకు దిగారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా రూ.4 వేల పెన్షన్ ఇవ్వాలని తహసీల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అధికారంలోకి రాగానే పింఛన్లు పెంచుతామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారని, ఏడాది గడుస్తున్నా ఆ హామీని నిలబెట్టుకోలేదని బీడీ కార్మికులు మండిపడ్డారు. పెన్షన్లు పెంచకపోతే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశ్, బీడీ కార్మికులు కళావతి, లక్ష్మి, అనిత, గంగామణి, వనిత, జమున, మంగ, సావిత్రి, భాగ్య తదితరులు పాల్గొన్నారు.





